# స్వామి వివేకానంద



1&2 సమగ్ర, సప్రామాణిక జీవిత గాథ

# స్వామి వివేకానంద

## సమగ్ర, సప్రామాణిక జీవిత గాథ

## 1

అనుసృజన:
స్వామి జ్ఞానదానంద

రామకృష్ణ మఠం
దోమలగూడ, హైదరాబాదు - 500 029

Published by
Adhyaksha
Ramakrishna Math
Domalguda, Hyderabad - 29

© Ramakrishna Math, Hyderabad
All rights reserved

XIV - 7M5C - 05 - 2012
12017
12019**(set)**

Printed in India at
Graphica Printers
Hyderabad.



**ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్యవరాన్ నిబోధత ।**
**క్షురస్యధారా నిశితా దురత్యయా**
**దుర్గం పథస్తత్ కవయో వదంతి ॥**

లేవండి, మేల్కొనండి! శ్రేష్ఠులైన ఆచార్యులను ఆశ్రయించి ఆత్మను సాక్షాత్కరించుకోండి. ఆ మార్గం కత్తి అంచులా తీక్ష్ణమైనది. దానిని అనుసరించి పోవడం ఎంతో ప్రయాసతో కూడినదనీ, తరించడం ఎంతో కష్టమనీ విజ్ఞులు చెబుతారు.

**స్వామి వివేకానందకు బాగా నచ్చిన కఠోపనిషత్ మంత్రం**



**ఓం**

**నమః శ్రీయతిరాజాయ**
**వివేకానంద శూరయే ।**
**సచ్చిత్ సుఖ స్వరూపాయ**
**స్వామినే తాపహారిణే ॥**

యతిరాజా, యథార్థ జ్ఞానమూర్తీ, సమస్త దుఃఖాలను బాపువారూ అయిన వివేకానంద ఋషివరేణ్యునికి ప్రణమిల్లుతున్నాను.

**— స్వామి రామకృష్ణానంద**

# ఇంతకీ ఎవరీయన?

బాల భానుని నునులేత కిరణాలు మళ్లీ ఒకసారి లోకాన్ని స్పృశింపడానికి సిద్ధమయ్యే వేకువజామున కలకత్తా గంగానదిలో పడవలో వెళుతున్నాం.

తెల్లవారీ తెల్లవారని ఆ ఉదయం కాలంలో గంగానదీ, దాని తీరాలూ అస్పష్టంగా కానవస్తున్నాయి.

గంగ మీదుగా వీచే శీతలవాయువు మా శరీరాలను సుతిమెత్తగా తాకుతూండగా, వేకువజాము శుభోదయానికి తగ్గ మాధుర్యమూ, ఉపశమనమూ మనస్సును స్పృశిస్తూండగా మేం ఏదో స్వప్నలోకంలో విహరిస్తూన్నట్లు పడవలో తేలిపోతున్నాం.

హౌరా నుండి బయలుదేరిన పడవ నాలుగు మైళ్లు దాటటం మాకు తెలియలేదు. ఆ సమయంలో ఎడమ వైపు గంగా తీరంలో ఒక అద్భుత దృశ్యం తెరచుకొన్నది –

ఆరితేరిన ఒక శిల్పి చెక్కిన శిలలా నాలుగు అందమైన దేవాలయాలు సుదూరం విస్తృతించిన శోభాయమానమైన పచ్చిక మైదానంలో మౌనతపస్సులో మగ్నమై ఉన్నాయి! ఆ దేవాలయాల ఆకృతే ప్రగాఢ ప్రశాంతతను మాలో నింపివేస్తున్నది. మాకు తెలియకుండా మైమరచిపోతున్నాం.

ఈ దేవాలయాలు ఏవి?



ఈ దేవాలయాలలో కొలువై ఉన్న దేవత లెవరు?

ఉదయం కాబోతోంది. ఆ దేవాలయాల్లో తపస్సులో మునిగివున్న సన్న్యాసులు ఒకరొకరుగా బయటికి వస్తున్నారు. ఆ మసక వెలుతురులో ప్రశాంతంగా ఆ దేవాలయాలలో ఆరాధించడానికి పోతున్నారు.

వీ రెవరు?

సమధికోత్సాహం మమ్ము ప్రేరేపించగా పడవల రేవు వద్ద దిగి ఆ దేవాలయాల వైపుగా వెళ్లసాగాం. ఏదో ఒక నూతన ప్రపంచంలోకి ప్రవేశించ బోతున్నామని మనస్సు చెబుతోంది.

ఇదుగో ప్రవేశించాం.

అది బేలూరు మఠం!

"నేను కాశీకి వెళ్లలేను. ఏం చేయాలి?" అని ఒక వ్యక్తి అడిగినప్పుడు, "ఎందుకు, బేలూరు మఠానికి వెళ్లవచ్చు కదా! అక్కడ ధ్యానం సహజంగా సిద్ధిస్తుంది. అక్కడ శ్రీరామకృష్ణులు ప్రత్యక్షంగా జీవించడం నేను చూశాను" అని మాతృమూర్తి శ్రీ శారదాదేవి వచించిన పుణ్యతీర్థం అది! పావనులూ, పుణ్యమూర్తులూ జీవించి తమ పాదపద్మాల స్పర్శచే దివ్యత్వాన్ని సంతరించుకొన్న పుణ్యక్షేత్రం అది!

పడవల రేవు ద్వారంలో ప్రవేశించగానే కుడివైపు చిన్న రెండంతస్తుల దేవాలయం కనిపించింది. లోపలికి వెళుతున్నాం.





అక్కడ కొలువైన వారు –

"స్వర్గంలో జీవించే ఒక ఋషి మానవరూపు దాల్చి ఏతెంచారు" అని భగవాన్ శ్రీరామకృష్ణులచేతా, "హిందూమతాన్ని కాపాడారు, తద్వారా భారతదేశాన్ని కాపాడారు", "లోక చింతనాధోరణులను మలుపు త్రిప్పిన వారు" అంటూ మహాపండితులచేతా శ్లాఘింప బడిన వ్యక్తి –

స్వామి వివేకానంద!

ఆయనను ఆరాధించి పైకి వెళుతున్నాం.

అక్కడ –

ఆదిలో ఉద్భవించిన నాదమనీ, ప్రణవమంత్రమనీ స్తుతింపబడే ఓంకార మంత్రానికి గర్భగుడి! అందమైన వేదిక, దాని మీద ఒక కలశం. దానిపై వికసించిన ఒక తామర, దాని మీద ఓంకారం! అంతా తెల్లని పాలరాతితో అద్భుతంగా మలచబడివుంది.

మనస్సు కాస్త కూడదీసుకొంటున్నాం. సర్వత్రా వ్యాపించిన ఆ ఓంకార నాదంలో కాసేపు మనస్సును లయింపజేస్తున్నాం.

గంగ నుండి దేవాలయాలను దర్శించడం ఒక అనుభవమయితే, తీరం నుండి గంగను దర్శించుకోవడం సంతోషదాయకం. ప్రణవ దేవాలయం వెనుక నిలబడి అలాంటి అద్భుత దర్శనం చేశాం.



తరువాత చూడనున్నది మాతృదేవి శ్రీ శారదాదేవి దేవాలయం. గంగానది స్నానఘట్టం వద్ద ఒక చిన్న దేవాలయంలో ఆమె కొలువై ఉన్నారు. "ఇక్కడకు వచ్చిన వారికీ, రాని వారికీ నా ఆశీర్వాదాలు లభించుగాక!" అని దీవించిన మూర్తీభవించిన ప్రేమమూర్తి గదా ఆమె! అందుకోసమేనేమో గంగాభిముఖంగా కొలువుదీరి ఉన్నారు! స్నానార్థం వచ్చేవారికి కూడా అనుగ్రహం కలగాలన్నదే ఆమె సంకల్పం కాబోలు!



తరువాత, భగవాన్ శ్రీరామకృష్ణుల మానస పుత్రునిగా పరిగణింపబడిన స్వామి బ్రహ్మానంద దేవాలయం కానవస్తుంది.

అక్కడ ఆరాధించి దిగుతున్నప్పుడు మన కళ్ల ముందు బ్రహ్మాండంగా వెలసివున్న ఒక దేవాలయం కానవస్తుంది. ఒక్కో మెట్టుగా ఎక్కి ఆ దేవాలయంలో ప్రవేశించాం. ప్రతి మెట్టు ఎక్కుతున్నప్పుడు ప్రపంచం కాస్తకాస్తగా వైదొలగిపోతున్నట్లుగా అనిపించింది. మెల్లగా మెట్లు ఎక్కుతున్నకొద్దీ గర్భగుడి కానవచ్చింది.

అక్కడ కొలువుదీరి ఉన్నవారు భగవాన్ శ్రీరామకృష్ణులు!

దేవాలయపు అసాధారణ ఆకృతీ, ఆశీనులైవున్న శ్రీరామకృష్ణుల గాంభీర్యమూ వేదాలు భగవంతుణ్ణి "రాజాధిరాజాయ" అని స్తుతించడాన్ని జ్ఞాపకానికి తెస్తున్నాయి. ఆ నిశ్శబ్ద ప్రశాంతతానందంలో కాసేపు మునిగిపోయాం.

కాసేపు దేవాలయ రూపురేఖల సొబగులను, విభిన్న శిల్ప కళాఖండాల సంగమాన్ని ఆస్వాదించాం.

మనస్సులో అనిర్వచనీయమైన ప్రశాంతతా, ఆనందమూ పొంగిపొరలుతున్నాయి.





సహజంగానే ఇప్పుడు ఒక ప్రశ్న తలెత్తింది -

ఈ ఇహలోకంలో ఇలాంటి ఒక పరలోకాన్ని సృష్టించింది ఎవరు? ఈ విధంగా సౌందర్యమూ, ప్రశాంతతా, దివ్యత్వమూ మమేకమై విరాజిల్లే ఈ ఆధ్యాత్మిక లోకాన్ని మలచిన శిల్పి ఎవరు?

అక్కడున్న భవనాల వైపుగా వెళ్లాం. అక్కడకు వెళ్లాక మా విస్మయం అనేక రెట్లు అధికరించింది. మేం సందర్శించినవి ముక్తినొసగే దేవాలయాలు మాత్రమే కాదు; లోకానికి శ్రేయస్సు చేయాలన్నదే లక్ష్యంగా చేసుకొని, అనేక రకాల పనులలో తలమునకలయ్యే ఒక సంస్థ జీవనాడిగా విరాజిల్లే గర్భగుడులు కూడా. రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్ అనే పేర్లతో పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, వైద్యశాలలు, సహాయ పునరావాస కార్యాలు మొదలైన ఎన్నో కార్యక్రమాలకు ఊటగా విరాజిల్లేవి ఈ నూత్న దేవాలయాలని గ్రహించి దిగ్భ్రాంతితో మా కళ్లు విచ్చుకొన్నాయి.

ఇలా ముక్తినొసగే, లోకానికి మేలు ఒనగూర్చే రెండు పథాలను ఒకే మార్గంలో సమైక్యపరచిన మహాత్ముడెవరు?

దేవాలయాలూ, ఆరాధనా హిందూమతానికి క్రొత్త కాదు. హిందువుల మయిన మనకు దేవాలయంలో కొలువైవున్న దేవతలతో మనలను అనుసంధించు



కోవడం ఎలాగో తెలుసు. కాని మన చుట్టూ జీవిస్తున్న మన సోదర మానవులతో మనలను ఎలా అనుసంధించుకోవాలో తెలుసుకోలేకపోయాం. అందుకు మనలను సిద్ధం చేయడానికి ఒక సరిక్రొత్త ఆరాధనా వ్యవస్థ ఆవశ్యమయింది. దీన్నే కదా ఇక్కడ ప్రత్యక్షంగా చూస్తున్నాం!

దేవాలయాల లోపల మాధవ సేవ, బయట మానవసేవ.

ఇటువంటి రెండు వంకల సేవ మూలంగా మనిషి ఔన్నత్యం పొందుతాడు; ఆతడి ఆత్మ వికసిస్తుంది; ఆతడిలో కొలువై ఉన్న దివ్యత్వం అభివ్యక్తమవుతుంది, నిజమైన మనుషులు రూపొందుతారు. ఈ రకంగా ఒక నూతన మానవజాతి ఉత్పన్నమవుతుంది.

ఈ విధమైన ఒక నూతన యుగానికి సాధనమై ఉన్న ఆ యుగ నాయకుడెవరు?

కుతూహలం పొంగుతున్నదా?

ఆయనే మేం ప్రప్రథమంగా ఆరాధించిన స్వామి వివేకానంద!

ఆ యుగ నాయకుణ్ణి గురించి తెలుసుకోవడం, చింతన చేయడం జిజ్ఞాసకు విందు, ఆధ్యాత్మిక సాధన!

కళ్లు మూసుకొని ఒక్క క్షణం ఆ దేవర్షియైన స్వామి వివేకానంద దివ్యరూపాన్ని మనస్సులో ధ్యానిద్దాం.....

జీవితగాథలోకి పోదాం..... రండి.



**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2019**

* * *